నేడు ప్రమాణ స్వీకారం

ప్రొద్దుటూరు : జీకే సాధు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరిచే మన్ననలను పొందారు సాధు గోపాలకృష్ణ. ఈయన స్థానిక రెడ్ల కళ్యాణ మండపంలో ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

IN THE COURT OF THE II ADDL. DISTRICT AND SESSION JUDGE, M.M. DISTRICT AT: MEDCHAL
OS No. 15 OF 2023

Between:
Smt. Ch. Annapurna & another ... Plaintiffs
And
Daggu Krishna & others ... Defendants

To,
1.Sri M.V. Rama Chandra Reddy S/o Obul Reddy Aged about 66 years, Occ : Business R/o Saikutir Road, Proddatur, Kadapa.
2.Sri S. Gangi Reddy S/o Kathi Reddy Aged about 60 years, Occ : Business R/o BangraiahKottala, Proddatur, Kadapa.
3.Sri D. Raghava Reddy S/o Sri Ramula Reddy Aged about 53 years, Occ : Business R/o 2/551-2, Shastri Nagar, Proddatur, Kadapa Dist... Defendants No.6 to 8

Please take notice that the above Plaintiff herein has instituted above suit vide O.S. No.15 of 2023 on the file of Hon'ble II Addl. District and Sessions Judge, Medchal-Malkajgiri District, at Medchal for partition and separate possession. The said case is coming for appearance of Defendants No.6 to 8 in I.A. No.44 of 2023 and the matter is posted to 05-07-2024 for your appearance, If the Defendants No.6 to 8 fails to appear in the above matter through their Advocate or person on above said date at 10:30 A.M., before the Hon'ble Court or otherwise the matter will be adjudicated on merits.

//By the orders of the Hon'ble Court //
Sd/- C. HANUMANTH REDDY, ADVOCATE
Off #Flat No. 105, Shree Venkata Sai Estate, Beside Police station, Medchal Village & Mandal & District, Telangana State PIN-501401, Mobile: 98480 89670.

డయేరియా రాకుండా ముందస్తు చర్యలు



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక సంజీవ నగర్‌లో డయేరియా క్యాంపెయిన్, సీజన్ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జరుగుతుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి డయేరియా ఉంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని చెప్పారు. పిల్లల్లో డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది తద్వారా వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు. జ్వరం వస్తే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ దినేష్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్స్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సీఓలు సుబ్బారెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

రాచాయపేటలో డయేరియా

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వాంతులు, విరేచనాలు (డయేరియా)తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా జ్వరం రావడం, వాంతులు, విరేచనాలు రావడంతో పలువురు మంచం పట్టారు. ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలు శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న తాగునీటి పథకం (ఓహెచ్ఆర్)కు నిచ్చెన లేకపోవడంతో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది.

అనేక మార్లు మంచి నీటి పథకానికి నిచ్చెన ఏర్పాటు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల వ్యాప్తంగా 20 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా వీటిలో 5 ట్యాంకులకు నిచ్చెన లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో కోతులు కూడా అధికంగా ఉండటంతో ట్యాంకులలో దిగడంతో నీరు కలుషితమవుతున్నాయి.

రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో రాజీ అయిన కక్షిదారులకు అవార్డు ఫారం అందజేస్తున్న న్యాయమూర్తులు

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సందర్భంగా రెండు బెంచిలను ఏర్పాటు చేసి 314 క్రిమినల్ కేసులు, 13 సివిల్ కేసులు చొప్పున మొత్తం 327 కేసులు పరిష్కరించి రూ.1,32,10,148లు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లోక్‌అదాలత్ బెంచ్ మెంబర్లు వాసుదేవరావు, జి.జె.పి.ప్రభాకర్‌రావు, ఓ.ఎస్.వి.ప్రసాద్, ఓబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.కొండిశెట్టి అధ్యక్షతన 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు మిద్దెల గ్రామానికి చెందిన చెన్నారెడ్డి సహకారంతో రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ నిర్మల మాట్లాడుతూ ఒక పూర్వ విద్యార్థిగా విద్యార్థులకు సహకారం అందించాలనే మంచి ఆలోచన చేసిన చెన్నారెడ్డి దాతృత్వం అభినందనీయమన్నారు. మండల విద్యాశాఖ తరపున అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి, మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పెంచల్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, గరుడపట ఆదివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించండి



ఎమ్మెల్యే వరదకు శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్

ప్రొద్దుటూరు : అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వరద తొలిమారు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ సీఎస్ ఖాజా మొహిద్దీన్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. టీబీ, వసంతపేట కాంప్లెక్స్ పరిధిలోని మున్సిపల్ షాపింగ్ గదుల అద్దె పెంపును సమావేశంలో ఆమోదించారు. మోడంపల్లెలోని వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్ నిర్మాణాన్ని సదరు కాంట్రాక్టర్ ఎందుకు గడువులోగా పనులు పూర్తి చేయలేదని వరద ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలపై ఏసీపీ మునిరత్నం చర్యలు తీసుకోవడం లేదని, గతంలో ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేశామని కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, మహ్మద్ గౌస్ అడిగారు. ఏసీపీ సదరు బిల్డర్ వద్ద లంచం తీసుకున్నట్లు తన వద్ద ఆధారాలు ఉన్నాయని మురళీధర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో అధికారులపై వ్యక్తిగత విమర్శలు చేయవద్దని, ఆధారాలు తనకు ఇస్తే ఉన్నతాధికారులకు పంపి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కండువా మార్చిన కౌన్సిలర్లు

వైఎస్సార్‌సీపీ తరపున కౌన్సిలర్లుగా ఎంపికైన పలువురు టీడీపీ కండువాలను ధరించి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల గతంలో వీరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లుతో విభేదించి దూరంగా ఉన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, మునీర్ అహ్మద్, జంబాపురం వెంకటలక్ష్మి, చింతకుంట సరితా రెడ్డి టీడీపీ కండువా ధరించారు. అధికారులు, సభ్యులు, పాత్రికేయులు తప్ప మిగతా వారు సమావేశ మందిరానికి రావద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. అయితే పోలీసుల ఆంక్షలను లెక్క చేయకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ సమావేశ మందిరానికి వచ్చి కూర్చున్నారు.

జరిమానా

కాశినాయన : మండలంలో అనుమతులు లేకుండా నగిలేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న వారిని గుర్తించి రూ.1.25 లక్షలు జరిమానా విధించినట్లు తహసీల్దారు క్రిష్ణ తెలిపారు. పోరుమామిళ్లకు చెందిన రెండు వాహనాలను అదుపులోకి తీసుకుని జరిమానా విధించామన్నారు. అలాగే ఇటుగుల్లపాడు పరిసరాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుని జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష

దువ్వూరు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ ఉమారాణి అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, తహసీల్దార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 7,470 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు.





ఉద్యోగ విరమణ



ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ కాశీప్రసాద్‌రెడ్డి పదవీవిరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశీ ప్రసాద్ రెడ్డి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థినుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడారు. అనంతరం కాశీప్రసాద్‌రెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ప్రముఖ డాక్టర్లు రామమునిరెడ్డి, నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్

బి.కోడూరు : మండలంలో సుదీర్ఘ కాలం పని చేసి ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయబోతున్న రామసముద్రం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిటిసైమన్ సత్యబాబు, రాజుపాలెం దళితవాడ పాఠశాల ఉపాధ్యాయులు కామిరెడ్డి రామచంద్రారెడ్డిలను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానం చేశారు. మండల విద్యాశాఖాధికారి సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఇరువురు ఉపాధ్యాయులు 40 సంవత్సరాల సుదీర్ఘ కాలం అవిశ్రాంతంగా పని చేసి అనేక మంది విద్యార్థులకు విద్యాదానం చేయడంతోపాటు మంచి భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి దవనం పుల్లయ్య మాట్లాడుతూ అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయరామయ్య, కృష్ణారెడ్డి, రాజగోపాల్, తిరుమల్‌రెడ్డి, నజీమ్‌బాషా, కుమార్‌బాబు, జయసుబ్బారెడ్డి, నాయబ్‌బాషా, రాజగోపాల్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జాన్ దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, యూనియన్ల నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయం పరిధిలోని ప్రజారోగ్య శాఖ విభాగంలో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న కె.జాన్ పదవీవిరమణ సన్మాన సభ శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డితో పాటు పారిశుధ్య విభాగం అధికారులు జాన్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీఐటీయూ నాయకులు చంటి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయమ్మ సేవలు మరువలేనివి



విజయమ్మ దంపతులను సన్మానిస్తున్న ఈఓపీఆర్డీ, పంచాయితీ కార్యదర్శులు

రాజుపాళెం : రాజుపాళెం పంచాయితీ కార్యదర్శి విజయమ్మ సేవలు మరువలేనివని ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో శనివారం విజయమ్మకు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, చాపాడు ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, ముద్దనూరు ఏపీఓ గంగయ్య, పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విజయమ్మ దంపతులను సన్మానించారు.

గుర్తుండి పోయేలా విధుల నిర్వహణ



హెచ్ఎం రమాదేవి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.రమాదేవి పాఠశాల చరిత్రలో గుర్తుండిపోయేలా విధులు నిర్వర్తించారని మండల విద్యాశాఖాధికారి టీఎం పద్మలత అన్నారు. హెచ్ఎం రమాదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం పాఠశాలలో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏర్పాటుకు కృషి చేయడమేగాక, క్రీడలు, శాస్త్ర విజ్ఞాన పోటీల్లో కూడా ప్రతిభకనబరిచేలా హెచ్ఎం ప్రోత్సహించారని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోశెట్టి రామమోహన్ అధ్యక్షతన పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సూర్యనారాయణరెడ్డి, మణిప్రకాష్, తవ్వా ఓబుళరెడ్డి, ఆనంద్, మునెయ్య, పద్మజ, మాధవిలత, నీరజ, స్వర్ణలత, చంద్రావతి, రాణి తదితరులు పాఠశాల అభివృద్ధిలో హెచ్ఎం రమాదేవి కృషిని, ఆమెతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి, ఆమె భర్త ప్రముఖ సంఘ సేవకులు అవ్వారు మల్లికార్జునలను సత్కరించారు. ఎంఈఓ–2 నరహరి శర్మ, ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వై.వెంకటసుబ్బయ్య, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు, మైదుకూరు బాలికల, ఉర్దూ, లెక్కలవారిపల్లె, వనిపెంట హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు గంగాభవాని దేవి, శివనారాయణమ్మ, ప్రిన్సిపాల్ గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.









డిగ్రీ కళాశాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ఫలితాలను సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. సుజిత అనే విద్యార్థిని 10కి 10 జీపీఏ సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. కళాశాలను 2008లో ఏర్పాటు చేసినా ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవని, కళాశాల అభివృద్ధికి చొరవ చూపి కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కళాశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

